# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## యజమానులు కౌలుకు ఇవ్వరు..

కాంగ్రెసోళ్లు ధరణిని తొలగించి కొత్తదేదో తెస్తమంటున్నరు. కొత్తగా పెట్టేదాంట్లో కౌలుదారుల కాలం పెడ్తరంట. ఇగ అది పెడితే భూములున్నోళ్లు ఎవరికీ కౌలుకు ఇవ్వరు. ఇంక వీళ్లు అధికారంలోకి వస్తే రైతుబంధును.. రైతుభరోసా పేరుతో పెట్టుబడిసాయాన్ని యజమానులకు ఇస్తే కౌలుదారులకు ఇవ్వరంట, కౌలుదారులకు ఇస్తే యజమానులకు ఇవ్వరంట. ఇట్ల జేస్తే రైతులు భూములను కౌలుకు ఇవ్వరు, పంటలు కూడా పండయి. పదేండ్ల కిందటి బీడుభూములే కనిపిస్తయి. అటు రైతులు, ఇటు కౌలుదారుల నోట్లో మన్ను గొట్టి మొత్తానికి రైతుబంధు సాయం ఇవ్వొద్దని కాంగ్రెసోళ్లు చూస్తున్నరు. మొదటినుంచి కాంగ్రెసోళ్లకు రైతులంటే పగనే. రైతులు బాగుంటే వీళ్ల కండ్లు మండుతున్నట్లు న్నయ్. మొత్తానికి ఎవుసాన్ని మంటగలపాలని చూస్తున్నరు.

**-పాకల శ్రీధర్ గౌడ్, రైతు, బట్టాపూర్, ఏర్గట్ల మండలం**



## కాంగ్రెస్ వస్తే.. బీడు భూములే..

**సీఎం కేసీఆర్** పదేండ్లలో వ్యవసాయాన్ని పండుగ జేసిండు. బీడు భూములను సస్యశ్యామలంగా మార్చిండు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసిండు. కాంగ్రెసోళ్లు అధికారంలోకి వచ్చేందుకు నాటకమాడుతుండ్రు. మంచి వ్యవస్థలను మంటగలిపి.. రైతులను ఆగం జేయాలని చూస్తున్నరు. ధరణిని తీసేసి మళ్లీ పంచాయితీలు పెట్టే పటేల్, పట్వారీ వ్యవస్థను తెస్తమంటున్నరు. దీంతో ఊర్లల్లో లొల్లిలు షురూ అయితయ్. భూముల కోసం కొట్లాటలు పెట్టుకుంటరు. రైతులందరూ కొట్లాటలు, రికార్డుల కోసం తిరుగుడు మొదలైతది. దీంతో ఎవుసం ఎండుతది. రైతులు రోడ్డు మీద పడ్తరు.

**-పార్శపు శ్రీకాంత్ రెడ్డి, కమ్మర్‌పల్లి**



# దగాకోరు కాంగ్రెస్

### రైతులను ముంచేలా కుట్రలు

- అధికారంలోకి రాకముందే అన్నదాతల నోట్లో మన్ను పోస్తున్న వైనం
- రైతుబంధు నిలిచిపోయేలా హస్తం పన్నాగం
- కాంగ్రెసోళ్లకు ఓటేస్తే.. మన గోయ్యి మనమే తవ్వుకున్నట్లేనని రైతుల ఆవేదన
- రైతు సంక్షేమం కేసీఆర్‌తోనే సాధ్యం
- రిస్క్ తీసుకోం.. కారునే గెలిపిస్తామని స్పష్టీకరణ

ధరణి



## కాంగ్రెస్ వస్తే భూముల హక్కులు గాలిలో దీపమే

కమ్మర్‌పల్లి, నవంబర్ 27: కాంగ్రెసోళ్లు వస్తే భూముల హక్కులు మళ్లీ గాలిలో దీపంలా మారిపోతాయి. రైతు తన భూమిపై పూర్తి భద్రతా భావంతో ఉంచేలా చేయడమే ప్రభుత్వం బాధ్యత. అలా ఉంచేలా ఒక వ్యవస్థనో, పరిష్కారాన్నో తేవాలనే ఆలోచన గత ప్రభుత్వాలు చేయలేదు. ఆ ఆలోచన సీఎం కేసీఆర్ చేశారు. రైతు భూమిని పరుల పరం కాకుండా ధరణి అనే వరం ఇచ్చాడు. కాంగ్రెసోళ్లు ధరణిని బంగాళాఖాతంలో పడేస్తామనడం ధరణితో భద్రత లభించిన రైతుల మనోభావాలను కూడా బంగాళాఖాతంలో పడేస్తామన్నట్లే.

**- కుమ్మరి భూమేశ్వర్, కమ్మర్‌పల్లి**

## లంచాలు మొదలైతయి..

ఏర్గట్ల, నవంబర్ 27: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రేవంత్ రెడ్డి ధరణిని తీసివేసి రైతులను ఇబ్బందిపాలు చేస్తాడు. ధరణి లేకపోతే చాలా మంది రైతులు వారి భూమి మొఖ మీద ఉన్నా ఆ భూమి వేరే వ్యక్తి పేరు మీద ఉంటుండె. దానికి కారణం లంచం ఇచ్చి అమాయకులైన వారి భూములను వారి పేరు మీద చేసుకుంటుండె. అట్ల మస్తు గొడవలు అయిన పరిస్థితులను చూశాం. అట్లాంటి బాధలు ఉండొద్దన్న నిర్ణయంతో సీఎం కేసీఆర్ ధరణిని తీసుకొచ్చి రైతుల భూములకు రక్షణ కల్పించిండు. ధరణిని గిట్ల తీసేస్తే మళ్లీ రికార్డులు చూడాల్సి వస్తది. మళ్లీ లంచాల రాజ్యం మొదలైతది.

**-ఏలేటి బాల్‌కిషన్ రెడ్డి, రైతు, ఏర్గట్ల.**



## ధరణిని తొలగిస్తామనడం కాంగ్రెస్ మూర్ఖత్వం

ఏర్గట్ల, నవంబర్ 27: పదేండ్లుగా పరిపాలనలో లేని కాంగ్రెస్ సోయి లేకుండా మాట్లాడడం, ధరణిని తొలగిస్తామని చెప్పడం ఆ పార్టీ మూర్ఖత్వం. మధ్యవర్తిత్వం, రిజిస్ట్రేషన్ కార్యాలయం దస్తావేజుల చుట్టూ తిరిగే పని లేకుండా కేసీఆర్ సార్ చేసిండు. ఎక్కడ ఉండి భూములు అమ్మినా, కొన్నా వాటిని అరగంటలోపే రిజిస్ట్రేషన్ చేసుకునేలా పోర్టల్‌ను ఏర్పాటు చేశారు. ఇంతమంచి ధరణిని వదిలేసుకోవాలనుకుంటే రైతులు నష్టపోతారు. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పి ధరణిని కాపాడుకుంటాం.

**- దేవేందర్, రైతు, దూద్‌గాం, మెండోరా మండలం**



## ఎవుసం ఇడ్సిపెట్టాల్సి వస్తది..

ధరణి లేకముందు రైతులకు మస్తు ఇబ్బందులు ఉండేవి. వీఆర్వోలు వాళ్లకు ఇష్టం వచ్చినట్లు ఒకరి భూములు, మరొకరి పేర్ల మీద చేస్తుండ్రి. అట్ల మస్తు మంది భూముల పంచాయితీలు జరిగి రైతుల మధ్య గొడవలు జరుగుతుండే. కానీ ధరణి వచ్చినంక చాలా మంది భూములకు రక్షణ కల్గింది. ఎవ్వరి భూములు వారి పేర్ల మీద అయినాయి. కంప్యూటర్‌లో చూసుకుంటే ఎవ్వరి భూమి ఎంత ఉన్నదో మొత్తం వివరాలు కన్పిస్తాయి. కాంగ్రెస్ పార్టీకి ఓటు గాని వేస్తే ధరణిని తీసేస్తరు. ధరణిపోతే ఇగ రైతుల భూములు ఆగమైతాయి. మళ్లీ కథ మొదటికి వస్తది. రైతులు ఎవుసం ఇడిసిపెట్టి ఆఫీసర్ల వెంట తిరగాల్సి వస్తది.



**- నడ్పోల్ల హన్మంత్ రెడ్డి, రైతు, దోంచంద, ఏర్గట్ల మండలం**